క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్ల వారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంక రించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు ప్రత్యేక అభిషేకాలను చేపట్టగా మరి కొందరు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ఎం.కృష్ణ



ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ఎం.కృష్ణ సోమ వారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బద్వేలు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో పామిడి, రాయదుర్గం, పు త్తూరు, హిందూపురంలో కమిషనర్‌గా, ఎమ్మిగనూరు, నంద్యాలలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేశారు. విజయవాడలో జోనల్ కమిషనర్‌గాను విధులు నిర్వర్తించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా పద్మజ



ఆదోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా ఎ.పద్మజ సోమవారం బాధ్యతలు స్వీకరించా రు. కర్నూలు ఎస్ఈ కా ర్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిణిగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన అధికారులు

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను సోమవారం నూతన మున్సిపల్ కమిషనర్ కె.కృష్ణ, గ్రామీణ నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.పద్మజ వేర్వేరుగా కలిశారు.

చట్టాలపై అవగాహనుండాలి



మాట్లాడుతున్న సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని అర్బన్: విద్యార్థినులు చట్టాలను తెలుసుకోవాలని టూటౌన్ సీఐ సూర్యమోహన్ రావు, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో డీఎస్పీ సోమన్న ఆదేశాల మేరకు విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలకు గురికావొద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఎవరైనా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్న క్యాంటీన్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయా క్యాంటీన్లకు వచ్చిన భోజనం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

రేపు చెకుముకి పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సైన్స్ సంబరాల్లో భాగంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకులు శంకరయ్య, మాదన్న, ఖాదర్ బాషా తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వారు పట్టణంలోని పలు ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందించారు. 8, 9, 10 తరగతుల పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

న్యాయవాది చంద్రయ్యకు న్యాయం చేయాలి

ఆదోని రూరల్: దళిత న్యాయవాది చంద్రయ్యకు న్యాయం చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరామ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ 06-04-2024వ తేదీన మధ్యాహ్నం న్యాయవాది చంద్రయ్య తన కార్యాలయంలో ఉండగా పెద్దతుంబళం గ్రామానికి చెందిన అప్పలయ్య గారి నాగరాజు, అప్పలయ్య గారి ఉరుకుందప్పలు వచ్చి బెదిరించి, కులం పేరుతో దూషించారన్నారు. ఒక న్యాయవాదికి ఇంత అవమానం జరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హుసేన్, మధుబాబు, యల్లప్ప, గద్దం నాగేంద్ర, శ్రీనివాసులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

దశమి ఉత్సవం.. ఉప్పొంగిన భక్తిభావం

- గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల ఉత్సవాలు
- పోటెత్తిన భక్తులు
- అడుగడుగునా స్వాముల అశ్వానికి పూజలు
- వైభవంగా స్వామివారికి పల్లకోత్సవం



స్వామివారి పల్లకీ మహోత్సవం



స్వాముల అశ్వాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు



ఆలయ ప్రాంగణంలో పోటెత్తిన భక్తులు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ ఆది చింతలాముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గోనెగండ్లలో సోమవారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం దేవాలయంలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామి వారి ఆశ్వాన్ని చింతలాముని, నల్లారెడ్డి స్వామి దేవాలయం నుంచి ఓబులేషు దేవాలయం వరకు ఆశేష భక్తుల జనుల హర్షధ్వనుల మధ్య ఊరేగించారు. అలాగే స్వామి వారి పల్లకీ మహోత్సవం ఘనంగా జరిగింది. ఊరేగింపు సందర్భంగా స్వాముల అశ్వానికి భక్తులు అడుగడుగునా పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు.

రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు

దశమి ఉత్సవాల సందర్భంగా ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలను సోమవారం ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ షురూ

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మించ తలబెట్టిన పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం భూసేకరణ ప్రారంభించనుంది. దీనికి సంబంధించి కేంద్ర రైల్వేశాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్‌లు జారీ చేసింది. దీని ప్రకారం కర్నూలు జిల్లాలోని ఇస్వి స్టేషన్ యార్డ్ వద్ద లెవల్ క్రాసింగ్ నెం.199కి బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు.

ఆరెకటికలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆరెకటిక కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆరెకటిక అభివృద్ధి సంఘ నాయకులు వీరప్రసాదరావు, ఎంకె.గిడ్డోజి రావు, ఏ.నాగేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆరెకటిక సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. ఆరెకటికలు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలని, అదేవిధంగా విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. సమావేశంలో సంఘ నాయకులు చౌడోజీరావు, శ్రీనివాసులు, రాఘవేంద్రరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మించండి

కౌతాళం: మండలం చాల వెనుకబడిన ప్రాంతమని ప్రతి ఎడాది అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని, తుంగభద్ర నదికి వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తుంగభద్ర దిగువ కాలువ ప్రవహిస్తున్న రైతులకు ఉపయోగపరంగా లేదన్నారు. ప్రస్తుతం తుంగభద్ర నదిపై చీకలపర్వి వద్ద కర్ణాటక ప్రభుత్వం బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మిస్తోందని, ఎడమ వైపున ఒక కాలువ తీసి రైతులకు సాగు, తాగునీరు అందించడానికి ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కర్ణాటక మంత్రులు, ఎంపీలు మన ప్రభుత్వంతో, అధికారులతో మాట్లాడి అనుమతులు తీసుకున్నారని ఇక్కడ ఉన్న మన నాయకులు కాని అధికారులు కానీ మన వైపు కుడికాలువ తీసుకోవడానికి ప్రయత్నాలు చేయడం లేదని విమర్శించారు.ఆదివారం కర్నూలుకు నీటిపారుదల శాఖ మంత్రి వస్తే ఆయనతో మన నాయకులు గురు రాఘవేంద్ర, దిద్ది, బసల్లదొడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ గురించి మాట్లాడారే తప్ప కోసిగిలో పలికనుమకు తూము ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం కానీ, చీకలపర్వి దగ్గర బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మిస్తున్న చోట రైట్ కెనాల్ నిర్మించాలని కానీ అడగక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, ఉలిగయ్య, రామలింగ, వీరేష్, అయ్యప్ప పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ సంజన్న తెలిపారు. సోమవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు అధ్యక్షతన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలలో అపరిశుభ్ర వాతవరణం కలిగి ఉంటే అనారోగ్య బారి నపడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి విద్యార్థి గమనించి మన చుట్టు ఉన్న ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా తోటి మిత్రులకు, బంధువులకు సూచించాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.వేదవతి, వ్యాయమ ఉపాధ్యాయులు కే.చిట్టి ప్రసాద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న కిడ్డీస్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

ఆదోని అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదోని పట్టణంలోని కిడ్డీస్ ఉన్నత పాఠశాల, రూట్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, యాజమాన్యం కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షలు విరాళంగా అందించారు. సోమవారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కును అందజేశారు. అనంతరం గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన ఎం.హర్షవర్ధన్ (597 మార్కులు)కు రూ.50 వేలు, అలాగే పట్టణ టాపర్‌గా నిలిచిన కె.శ్రీవల్లి (596 మార్కుకు) అనే అమ్మాయికి రూ.25 వేల నగదు బహుమతిని ముఖ్యమంత్రి చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీ కేశవ నారాయణరెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరు పాడు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసి, దళితులను అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణమరాజుపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఎంఆర్‌పీఎస్ శ్రేణులు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణమ రాజుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. అదేవిధంగా కాకినాడలో దళితుడైన వైద్యుడు ఉమామహేశ్వరావును దుర్భాషలాడి దాడి చేసిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజిపై కూడా ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పెద్దయ్య, ప్రకాశం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

25న మెగా వైద్య శిబిరం

ఆదోని అర్బన్: ఈనెల 25న ఆదోని పట్టణంలో మొట్టమొదటి సారిగా 15 మంది డాక్టర్లతో 35 మంది స్టాఫ్‌తో రెండు మెడికల్ కాలేజీలు, మూడు పెద్ద ఆస్పత్రుల అనుసంధానంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆదోని పట్టణ అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. పట్టణంలోని పూలబజార్ వాసవీ కళ్యాణ మండపంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అవోపా సెక్రటరీ డైమండ్ రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటేష్‌బాబు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ఆదోని అర్బన్: స్థానిక ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగరాజుగౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లోకేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న త్రీటౌన్ సీఐ సయ్యద్‌నూర్

ఆదోని అర్బన్: త్రీటౌన్ పరిధిలోని టెలికాంనగర్‌లో సోమవారం కర్ణాటక మద్యం తరలిస్తున్న సయ్యద్‌నూర్‌ను అదుపులోకి తీసుకొని 51 బాక్సుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని త్రీటౌన్ సీఐ రామలింగయ్య తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి తన ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 48 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఆదోని మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో బోయ హనుమయ్య అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ గ్రామంలోని వైన్‌షాపు నుంచి తెచ్చుకున్న 90 ఎం.ఎల్. పరిమాణం గల 66 టెట్రా ప్యాకెట్లను ఇంటి వద్ద విక్రయిస్తుండగా, దాడులు చేసి పట్టుకున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన మంత్రాలయం జెడ్పీహైస్కూలు విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

మంత్రాలయం:స్కూలు గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 ఫుట్‌బాల్ విభాగంలో లతిత, ముష్కాన్, పద్మశ్రీ, వరుణ్‌గౌడ్, అండర్-17 విభాగంలో అనిత, ఇమ్రాన్‌లను ఎంపిక చేశారు. అలాగే సెపక్‌తక్రా అండర్-14కు రామానాయుడు, అండర్-17లో మేబూనా,మురళి ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదిగారు. విద్యార్థులను హెచ్ఎం అంప య్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు నాగభూషణం, రామన్న, చంద్రశేఖర్, గోపాల్, సుబాషిని,పుష్పలత, సంధ్యారాణి పాల్గొన్నారు.

రహదారులు బాగు చేయండి

ఎమ్మిగనూరుటౌన్: శిథిలమైన ప్రధాన రహదారులను కూటమి ప్రభుత్వం సత్వరం బాగుచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన ఎమ్మిగనూరుకు వచ్చే ప్రధాన రహదారులైన కోసిగి, ఎమ్మిగనూరు-కోడుమూరు, ఎమ్మిగనూరు-గూడూరు రోడ్లు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మదర్ థెరిసా బీఈడీ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాఖలందర్, జయపాల్, నిసార్, సోమేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

నందవరం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, నీటి కుంటలు, డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో చెత్తను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ హెచ్ఎం చిత్రలేఖ, వ్యాయామ ఉపాధ్యాయులు రాజారాం మోహన్, అస్లాం తెలిపారు. 318 మంది బాలురు, 318 మంది బాలికలు పాల్గొంటారని చెప్పారు.

ఆన్‌లైన్ సమస్యల పరిష్కారంలో విఫలం

పెద్దకడబూరు : ఆన్‌లైన్ సమస్యల పరిష్కారంలో మండల తహసీల్దారు సిబ్బంది పూర్తిగా విఫలం అయ్యారని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ నాయకుడు జాఫర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు శ్రీనాథ్‌కి వినతిపత్రం సమర్పించారు. ఆన్‌లైన్ పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నాయకులు రాజు, తిక్కన్న, రెక్కల గిడ్డయ్య, ఇర్ఫాన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురానికి రూ.1,11,111 విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారని ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ తెలిపారు. బెంగళూరు వాస్తవ్యులైన శ్రీమతి విజయలక్ష్మి, వేవిఎన్ గుప్తాలు లేట్ సరోజమ్మ, లేట్ కృష్ణం భీమసేనశెట్టి జ్ఞాపకార్థం రూ.1,11,111ను దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి దేవాలయ కార్యాలయంలో నగదును అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా గడువులోపు పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, డీఎల్‌పీవో నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

ఆదోని సెంట్రల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరుతూ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి ప్రతం సమర్పించారు.

కళాశాలకు దగ్గర్లోనే వసతి భవనం ఏర్పాటు చేయాలి

ఆదోని పట్టణంలోని బీసీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహాన్ని కళాశాలకు దగ్గర్లోనే ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న విజయకుమారి, యల్లప్ప, వేణుగోపాల శర్మ, ఈశ్వరప్పలను ఎస్‌టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆసంఘ నాయకుడు అడివన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌టీయూ పూర్వ ప్రధాన కార్యదర్శి తిమ్మన్న,ఉపాధ్యక్షులు నాగరాజు, వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు షఫి, నరసింహారావు, బసవరాజు, ప్రసన్న రాజు, ఎంఈఓ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్స్‌గా ఉరుకుంద విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి చాంపియన్స్‌గా నిలిచారని హెచ్ఎం సునీతదేవి, వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్న తెలిపారు. పదో తరగతి విద్యార్థిని లలిత బేస్‌బాల్ రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిందన్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో 6 బంగారు, 3 వెండి, 6 క్యాంస పతకాలను కై వసం చేసుకున్నారని తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురు కబడ్డీలో రన్నర్స్‌గా నిలిచారన్నారు. సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులను సత్కరించారు.

సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి

ఆదోని టౌన్ /ఆదోని సెంట్రల్: సచివాలయ ఉద్యోగులకు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్‌లు అతికించే పని నుంచి విముక్తి కల్పించాలని, ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని కోరుతూ సోమవారం ఆదోని పట్టణంలోని సచివాలయం ఉద్యోగులు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. కొంతమంది రాజకీయ నాయకులు సచివాలయ ఉద్యోగుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. తమ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

లేబర్ చట్టాల రద్దు దుర్మార్గం

ఎమ్మిగనూరుటౌన్/ఆదోని రూరల్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వం 29 లేబర్ చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను అమలు చేయడం దుర్మార్గమని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణ గౌడ్, ఏఐటీయూ సీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు అన్నారు. కేంద్రం అమలు చేసిన లేబర్ కోడ్‌లకు నిరసనగా సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో, ఆదోనిలో బ్లాక్‌డేలో భాగంగా ఆందోళన చేపట్టారు. నాయకులు బి.వెంకన్న, వై.టి.భీమేష్, చిన్నన్న, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలి

ఆదోని టౌన్: ఆదోని-పత్తికొండ రూట్‌లో సమయానికి బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి విద్యార్థులు ఆందోళన చేశారు. విద్యార్థుల ఆందోళనతో బస్టాండులో ఆదోని-కర్నూలు, బెంగళూరు, ఆస్పరి, పత్తికొండ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. బస్టాండు గేటు ముందే విద్యార్థులు అడ్డుగా నిల్చొని ఆందోళన చేశారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ రాఘవేంద్ర, సెక్యూరిటీ, సిబ్బందితో ఉద్యోగులు, విద్యార్థులు వాగ్వాదం చేశారు. మంగళవారం నుంచి సమయానికి బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని డిపో అసిస్టెంట్ మేనేజర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.